క్లుప్తంగా

వాహనదారులు నిబంధనలు పాటించాలి

కొనకనమిట్ల: వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ మాధవరావు సూచించారు. మంగళవారం సాయంత్రం కొనకనమిట్ల సమీపంలో జాతీయ రాహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో ప్రజలకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. గణేశ్ మండపాలకు తప్పనిసరిగా పోలీస్, విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలని కమిటీల నిర్వాహకులకు స్పష్టం చేశారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో మండల బీజేపీ శాఖ ఇన్‌చార్జి బొంతల కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. దేశ భవిత కోసం యువత భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గాయం లక్ష్మీరెడ్డి, నాయకులు బలరామిరెడ్డి, బొప్పరాజు కేశవ, మాదాల కోటేశ్వరరావు, కె.నాగలక్ష్మి, చక్కా బాలరంగం తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

మార్కాపురం రూరల్: మార్కాపురం పట్టణ, రూరల్ పరిధిలో గణేష్ మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని రూరల్ ఎస్సై అంకమరావు, పట్టణ ఎస్సై సైదుబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగిల్ విండో విధానంలో అనుమతి పొందేందుకు 79950 95800 నంబరుకు వాట్సప్‌లో హాయ్ అని మెసేజ్ చేయాలని కమిటీలకు సూచించారు. నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, పండగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు.

పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

మార్కాపురం టౌన్: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై మరికొందరు దాడి చేసిన సంఘటన మంగళవారం స్థానిక చిన్నమసీదు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని చిన్నమసీదు ప్రాంతంలో నివాసముండే షేక్ మహమ్మద్, ఎమ్ఆర్‌కే బాషా మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో మంగళవారం ఇళ్ల వద్ద మహిళల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో మహమ్మద్‌పై ఎమ్ఆర్‌కే బాషా, ఆయన కుమారులు దాడి చేశారు. గాయపడిన మహమ్మద్‌ను తొలుత మార్కాపురం జీజీహెచ్‌కు, అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఘర్షణ విషయమై ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందాయని పోలీసులు తెలిపారు.

ఫీవర్ సర్వే పూర్తి చేయాలి

పొదిలి రూరల్: అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపట్టాలని వైద్య సిబ్బందికి డాక్టర్ ఎం.సుగుణకుమార్ సూచించారు. మంగళవారం ఉప్పలపాడు పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ నెల 17 నుంచి డీవార్మింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

జీతాలు చెల్లించాలి

పెద్దదోర్నాల: మండల పరిధిలోని మహాత్మా గాంధీ ఉపాధి హామీ పనుల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలను గత మూడు నెలల నుంచి చెల్లించడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. తమకు జీతాలు వేయాలంటూ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారు కనికరించటం లేదని రవీంద్రారెడ్డి, నరేష్, బాబు తెలిపారు. అయితే రాజీనామాలు చేసిన కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లకు మాత్రం జీతాలు మాత్రం టంచన్‌గా అందాయని, జీతాలు ఎలా వేశారని ప్రశ్నిస్తున్నారు. కాగా ఈ విషయమై ఎంపీడీఓ నాసర్‌రెడ్డిని వివరణ కోరగా వారికి స్లాట్ రాలేదని అందుకే జీతాలు వేయలేదని సమాధానమిచ్చారు.

ఉపాధ్యాయ ఆటల పోటీలు ప్రారంభం

యర్రగొండపాలెం: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన ఆటల పోటీలను ఎంఈఓలు పి.ఆంజనేయులు, మల్లు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ, క్రికెట్, షటిల్, షాట్‌పుట్, జావలిన్ త్రో, రన్నింగ్, లాంగ్ జంప్ పోటీల్లో పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుతో ప్రయోజనం

అర్ధవీడు(బేస్తవారిపేట): రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి షేక్ మహబూబ్ సూచించారు. మంగళవారం మాగుటూరులో పత్తి, కంది, ఆముదం, వరి పంటలను ఆయన పరిశీలించారు. ఈ నెల 15వ తేదీలోగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని, తద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు పొందవచ్చని చెప్పారు. వర్షాలతో పొలంలో చేరిన నీటిని బయటకు పంపిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, పది కిలోల పొటాష్ మొక్కల మొదళ్ల వద్ద వేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ, వీపీఏలు ఉన్నారు.

లంబోదరుడికి గిరాకీ!

- గణేశ్ చతుర్థికి వినాయక విగ్రహాలు సిద్ధం
- కంభం చెరువుకు నీరు చేరడంతో ఆశాజనకంగా విగ్రహాల విక్రయాలు



విగ్రహం కొనుగోలు చేసేందుకు చూస్తున్న కమిటీ నిర్వాహకులు

కంభం: గజాననుడికి ఘనంగా పూజలు చేసేందుకు భక్తులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గణనాథుడి విగ్రహాలకు ఇప్పటికే కమిటీల ఆధ్వర్యంలో ఆర్డర్లు ఇచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆసియా ఖండంలోనే రెండో పెద్ద అతిపెద్దది అయిన కంభం చెరువుకు భారీగా వరదనీరు వచ్చి చేరడంతో జళకళ సంతరించుకుంది. దీంతో ఈ ఏడాది గణేశుడి నిమజ్జనాలు మరింత కోలాహలం మధ్య నిర్వహించేందుకు యువత, భక్తులు ఉవిళ్లూరుతున్నారు. కంభంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది విగ్రహాలు నిమజ్జనానికి కంభం చెరువుకు తరలివస్తాయి. ప్రస్తుతం కంభం చెరువులో సుమారు 8 అడుగుల మేర నీరు చేరింది.

18 ఏళ్లుగా విగ్రహాల తయారీ

కరీంనగర్‌కు చెందిన వీరబోయిన శివ అనే కళాకారుడు తమ కుటుంబంతో సహా కంభలో నివాసం ఉంటూ గత 18 ఏళ్లుగా విగ్రహాలు తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. వీరి కుటుంబంలో మొత్తం 12 మంది ఉండగా అవసరాన్ని బట్టి స్థానికులను పనిలోకి తీసుకుంటున్నారు. పండగకు ఏడు నెలల ముందు కంభం చేరుకునే ఈ కుటుంబం ఏటా సుమారు రూ.20 లక్షల వరకు పెట్టుబడి పెట్టి విగ్రహాలు రూపొందిస్తోంది. మొత్తం విగ్రహాలు అమ్ముడైతే పెట్టుబడిపోను రూ.4 లక్షలు లాభం వస్తుందని, లేదంటే నష్టపోవాల్సిందేనని శివ చెబుతున్నాడు. కాగా మరి కొందరు వ్యాపారులు బయట నుంచి విగ్రహాలు తెచ్చి కంభం వై జంక్షన్‌లో విక్రయిస్తున్నారు.



శివ, విగ్రహాల తయారీదారుడు



వైజంక్షన్ వద్ద విక్రయానికి ఉంచిన విగ్రహాలు

3 నుంచి 10 అడుగుల సైజులో విగ్రహాలు

కంభంలో 3 అడుగుల నుంచి 10 అడుగుల గణేశ్ విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. రూ.4 వేల నుంచి రూ.45 వేల వరకు ధరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. మొత్తం 150 విగ్రహాలు తయారు చేస్తున్నామని, సగానికి పైగా విగ్రహాలకు అడ్వాన్సు తీసుకున్నామని మిగిలిన విగ్రహాలు పండగలోపు విక్రయిస్తానని వ్యాపారి శివ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతి తప్పనిసరి



గణేశ్ మండపాలు ఏర్పాటు చేసే వారు ముందుగా పోలీసు, విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలి. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ పరంగా జాగ్రత్తలు పాటించాలి. 5 మంది కమిటీ సభ్యులు రాత్రి పూట విగ్రహం వద్దే ఉండాలి. నిమజ్జనానికి వెళ్లే రూట్ మ్యాప్ ముందుగానే తెలియజేయాలి. అధిక శబ్దాలు లేకుండా చూసుకోవాలి. నిబంధనలు పాటిస్తూ పండగ, నిమజ్జన వేడుకను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి.

– బి.నరసింహారావు, కంభం ఎస్సై



మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

జగనన్నను కలిసిన ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మంగళవారం కలిశారు. నియోజకవర్గంలోనెలకొన్నసమస్యలపైఆయనతోచర్చించారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి

దర్శి: పెరిగిన నిత్యావసర ధరలు తగ్గించడంతో పాటు పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. దేశ వ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆందోళన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు నిత్యావసర వస్తువుల ఆకాశాన్ని అంటుతుండటంతో ప్రజలపై మోయలేని భారం పడుతుందన్నారు. ప్రభుత్వాలు వెంటనే ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఏఐటీయుసీ నాయకులు కె. హనుమంతరావు, బీకేఎంయు జూపల్లి కోటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్ కరుణానిధి, వెంకటేశ్వర్లు, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రమేష్

పంటలకు జీవం పోసిన వర్షం



సజ్జ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

దొనకొండ: మూడు రోజుల పాటు కురిసిన వర్షానికి గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలకు జీవం పోసిందని వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. ముఖ్యంగా మెట్ట పంటలైన కంది, పత్తి, ఆముదం, పొగాకు రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. మండలంలో మూడు రోజుల్లో 107 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. ఎటువంటి పంటలకు నష్టం లేదన్నారు. పొలంలో నీరు నిలబడకుండా 25 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ చల్లాలన్నారు. మంగళవారం పోలేపల్లిలోని సజ్జ, కంది పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు చేశారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది ఈశ్వరరెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అపోహలు వద్దు

మార్కాపురం: నేత్రదానంపై అపోహలు విడనాడాలని డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి పేర్కొన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన కరపత్రాలను మంగళవారం స్థానిక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత నెల 25 నుంచి ఈనెల 8 వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఎవరైనా మరణిస్తే వారి కుటుంబ సభ్యులు నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. తద్వారా కంటి చూపు కోల్పోయిన వారికి తిరిగి చూడగలిగే అవకాశాన్ని కల్పించినవారవుతారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రవణ్, షేక్ రబ్బానీ, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణపై అవగాహన

బేస్తవారిపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ఐవీ నియంత్రణపై ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు మంగళవారం హాండ్స్ ఆఫ్ కంపాషన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ కటికల విజయకుమారి మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధి కలుషిత రక్తం ఎక్కించడం, ఒకరికి వాడిన సిరంజీలు మరొకరికి వాడటం, సురక్షితం కాని లైంగిక సంపర్కం ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధికి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ సిబ్బంది శ్రావణి, విజయకుమారి, రవణమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

గిద్దలూరు రూరల్: ఆశా వర్కర్ల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సంఘ నాయకురాలు జి.విశ్రాంతమ్మ కోరారు. మంగళవారం స్థానిక అర్బన్ హెల్త్ క్లినిక్ వద్ద ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డాక్టర్ షరీఫ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడుతూ.. కనీస వేతన చెల్లించడంతోపాటు పని భారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్‌మెంట్ జీవో విడుదలయ్యేవరకు 60 ఏళ్లు నిండిన వారి రిటైర్‌మెంట్లు ఆపాలని, రికార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు రాజమణి, అంజలి, సరోజ, కల్యాణి, శైలజ, సీఐటీయూ నాయకుడు బి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయునిగా ఎంపిక

దొనకొండ: మండలంలోని దొనకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కె.నరసింహారావు ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయునిగా ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు తెలిపారు. ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్, విద్యాశాఖ అధికారుల చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. నరసింహారావు విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనేటట్లు శిక్షణ ఇవ్వటంతో పాటు ఎన్‌సీసీలో విద్యార్థులకు శిక్షణ వంటి సేవలను ప్రభుత్వం గుర్తించిందన్నారు. దొనకొండ పాఠశాల ఈ ఏడాది జిల్లా స్థాయిలో స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుకు రెండో స్థానంలో ఎంపిక కావడం వ్యాయామ ఉపాధ్యాయుని కృషి వల్లేనని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. నరసింహారావుకు ఉపాధ్యాయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.



కె.నరసింహారావు

వీఆర్ఓలు ఈకేవైసీ పూర్తి చేయాలి

తాళ్లూరు(దర్శి): వీఆర్వోలు త్వరితగతిన పంట నమోదు పూర్తి చేయాలని తహసీల్దార్ శింగారావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పంట నమోదుపై వీఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. ఏఓ ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 923 కౌలురైతు కార్డులు మంజూరు చేశామన్నారు. ఖరీఫ్ పంట నమోదు చేస్తున్న వీఏఏల రికార్డులను పరిశీలించారు. ఏఎస్ఓ విజయలక్ష్మి మాట్లాడుతూ అగ్రికల్చర్ యాక్షన్ ప్లాన్, సర్వే వివరాలను సత్వరమే పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శింగారావు

జ్వరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

ముండ్లమూరు(దర్శి): మండలంలో జ్వరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యాధికారి ఎం జాస్మిన్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయడంలో సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షాల ప్రభావంతో గ్రామాలు సాధారణ జ్వరాలు ఉన్నాయని వాటి నియంత్రణకు ప్రతి గ్రామంలో సిబ్బంది ఇంటింటికీ తిరిగి అవసరమైన మందులు పంపిణీ చేయాలన్నారు. రెండు మూడు రోజుల్లో జ్వరం తగ్గకుంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువస్తే అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో పది మంది నేత్రదాన అంగీకార పత్రాలుఇచ్చారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. అంధత్వ నివారణలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నారాయణరావు, సిబ్బంది శారదా, సుబ్బారావు, కన్యాకుమారి, యుగంధర్, నాగార్జున, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ముండ్లమూరులో మాట్లాడుతున్న వైద్యాధికారి జాస్మిన్

సస్యరక్షణ చర్యలతో దిగుబడి



బొప్పాయి పంట పరిశీలిస్తున్న హెచ్ఓ ఆదిరెడ్డి

యర్రగొండపాలెం: అధిక వర్షాల కారణంగా ఉద్యాన పంటల్లో వచ్చే తెగుళ్లను అరికట్టేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని హెచ్ఓ పి.ఆదిరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని పలుప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్న బొప్పాయి, అరటి, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. బొప్పాయిలో కాండం కుళ్లు, వేరుకుళ్లు తెగులు రాకుండా రిడోమిల్ 2 గ్రాములు లేదా అలియట్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్లలో పోయాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

తాళ్లూరు(దర్శి): మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ప్రతికూల వాతావరణంలో కూడా అధిక దిగుబడులు పొందవచ్చని ఏఓ ప్రసాద్‌రావు సూచించారు. మండలంలోని నాగంబొట్లపాలెం, అయ్యలపాలెంలలో క్షేత్ర పర్యటనలో భాగంగా సజ్జ పంటలను పరిశీలించారు. సజ్జలో అంకుర దశ, పూత దశ గింజ పాలు పోసుకునే దశ, గింజ గట్టి పడే దశలు కీలకమన్నారు. ఈ సున్నిత దశల్లో నీటి తడులివ్వాలని తెలిపారు. ప్రకృతి సాగు ఇన్‌చార్జి పి.నరసింహులు మాట్లాడుతూ ద్రవ జీవామృతాన్ని నీరు పారించేటప్పుడు 200 లీటర్లు ఎకరా పొలంలో పారించాలన్నారు. ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీవీ రమణ మాట్లడుతూ వరికి తప్ప అన్నీ పైర్లు వేసుకునే రైతులకు డ్రిప్, స్ప్రింకర్ల పైపులు రాయితీపై మంజూరు చేస్తున్నామన్నారు. వీఏఏ డి.శ్రీను, వర్షిణి, వాణి, కోటిరత్నం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పొలంబడిలో అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రసాద్‌రావు

వివాదాస్పద భూమిపై విచారణ

తాళ్లూరు(దర్శి): మండలంలోని సర్వే నంబర్ 474లో ఉన్న ప్రభుత్వ అనాధీన పోరంబోకు వివాద భూమిని తహసీల్దార్ శింగారావు మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సర్వేయర్ బాబురావు,రెవెన్యూ సిబ్బంది కలిసి భూమిని పరిశీలించారు. ఆక్రమదారుల విషయంలో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.



భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శింగారావు

విద్యుత్ పునరుద్ధరణకు సహాయ చర్యలు



వరద ముంపు ప్రాంతంలో సేవలు అందిస్తున్న విద్యుత్ సిబ్బంది

యర్రగొండపాలెం: విజయవాడ వరద ప్రాంతాల్లో దెబ్బతిన్న విద్యుత్ లైన్ పునరుద్ధరించేందుకు యర్రగొండపాలెం ఏఈ అల్లూరయ్య ఆధ్వర్యంలో లైన్‌మెన్, షిఫ్ట్ ఆపరేటర్లు మంగళవారం అక్కడికి చేరారు. వరద ప్రాంతాల్లో సేవలు అందించడం తమ అదృష్టమని, పనులు పూర్తి అయిన వెంటనే తాము స్థానికంగా విధుల్లో చేరుతామని వారు తెలిపారు.

క్రమశిక్షణతో బంగారు భవిష్యత్

కొనకనమిట్ల: విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి ఎదిగి నలుగురికీ ఆదర్శంగా ఉంటాలని ఎస్సై కె.మాధవరావు పేర్కొన్నారు. మంగళవారం కొనకనమిట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాల్యంలో ఎలా నడుచుకోవాలో అవగాహన కల్పించారు. చదువుకునే సమయంలో పక్కదోవ పడితే ఎదుర్కొనే ఇబ్బందుల గురించి తెలియజేశారు. మంచి లక్షణాలు అలవరుచుకుని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకరావాలని విద్యార్థులకు హితబోధ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్సై మాధవరావు

విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ ఏలూరి రామచంద్రారెడ్డి

పెద్దారవీడు: ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలో ఎస్. కొత్తపల్లి గ్రామంలో నీటి కుంటలో పడి మృతి చెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులకు చైర్మన్ ఏలూరి రామచంద్రారెడ్డి మంగళవారం నగదు పంపిణీ చేశారు. ముగ్గురు విద్యార్థుల కుటుంబాల సభ్యులను పరామర్శించిన అనంతరం ఒక్కొక్క కుటుంబానికి రూ. 10 వేల చొప్పున అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈతకు వెళ్లి చిన్నారులు మృత్యువాతకు గురికావడం చాలా విషాదకరమని, కుటుంబ సభ్యులకు ప్రగఢ సానుభూతి తెలిపారు. మార్కాపురం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, పెద్దారవీడు, పెద్దదోర్నాల బీజేపీ మండల అధ్యక్షుడు బొచ్చు కోటిరెడ్డి, వీరారెడ్డి, టీడీపీ నాయకులు గొట్టం శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.